## పాఠశాలల్లో టీచర్ల ఫొటోల ప్రదర్శన

- డీఈవో, ఎంఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు
- గైర్హాజరును అరికట్టేలా సర్కారు చర్యలు
- కేంద్రం నిబంధనల మేరకే నిర్ణయం: విద్యాశాఖ

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరును అరికట్టేందుకు ప్రభుత్వం తాజాగా ఓ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయుల ఫొటోలను పాఠశాలల్లో ప్రదర్శించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి డీఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వులు 100శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే హాజరు చూపుతూ వేతనం తీసుకున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మరికొందరైతే ఏకంగా ఏళ్ల తరబడి కూడా విధులకు హాజరుకాని ఉదంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదరు పాఠశాలలో ఎవరెవరు పని చేస్తున్నారో వారి ఫొటోలను పదర్శిస్తే స్పష్టత వస్తుందని, కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. మరోవైపు తమ వద్ద క్వాలిఫైడ్ టీచర్లు పని చేస్తున్నట్టు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వానికి వివరాలు సమర్పిస్తున్నాయి. కానీ చాలా పాఠశాలలు అర్హతలు లేని వాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్లలోనూ టీచర్ల ఫొటోలు ప్రదర్శించేలా నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

## పెద్దల కోసం మా ఇండ్లు కూల్చిండ్రు

- పునరావాసం కల్పించి న్యాయం చేయండి
- శ్రీ స్వామివివేకానంద నగర్ దళితుల ఆక్రందన

ఖైరతాబాద్, డిసెంబర్ 9: బడాబాబుల నిర్మాణాల కోసం తమ ఇండ్లను అన్యాయంగా కూల్చేశారని ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని శ్రీస్వామివివేకానందనగర్ బస్తీకి చెందిన దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే తమకు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. ఆ బస్తీకి చెందిన ఎంబీ కృష్ణ, జ్ఞానేందర్, డీ ఆనంద్‌రావు, ఎం వసంత్ కుమార్, ఎం సువర్ణ, పద్మావతి సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ గోడు ను వెళ్లబోసుకున్నారు. 1957లో ఏర్పడిన తమ బస్తీలో పేద దళితులే అధికంగా ఉంటున్నారని, 1974లో ప్రభుత్వం తమ బస్తీకి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి కల్పించిందని తెలిపారు. తమ బస్తీ గుండా రోడ్డును నిర్మించాలని పక్కనే ఉన్న జనప్రియ అపార్ట్‌మెంట్‌వాసులు పట్టుబట్టడంతో ఆ అంశంపై నిర్ణయం తీసుకోవాలని 2006లో కోర్టు అప్పటి కలెక్టర్‌ను ఆదేశించిందని, దీంతో బస్తీ వాసులకు పునరావాసం కల్పించిన తర్వాతే రోడ్డు వేస్తామని కోర్టుకు కలెక్టర్ నివేదించారని వివరించారు. ఇటీవల శతాబ్ది పేరుతో మరో భవనాన్ని నిర్మించడంతో అందులోని వారు కూడా రోడ్డు కావాలని హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే ఈ ఏడాది జనవరి 29న అధికారులు వచ్చి రోడ్డు విస్తరణ పేరుతో 19 ఇండ్లను కూల్చివేశారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే పునరావాసం కల్పించాలని కోరారు.

## బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం

భీమదేవరపల్లి, డిసెంబర్ 9: బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో చోటుచేసుకుంది. ముత్తారం గ్రామానికి చెందిన కాశిరెడ్డి ఆదిరెడ్డికి ముల్కనూరులో ప్రైవేట్ పాఠశాల ఉంది. ఎప్పటిలాగే పాఠశాలలో సోమవారం వేకువజామున స్కూటీని చార్జింగ్ పెట్టాడు. ఈ క్రమంలో బ్యాటరీ పేలి స్కూటీ పూర్తిగా దగ్ధమైంది.



# సిరీస్ గెలిచి.. అగ్ర భాగాన నిలిచి..



### డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తొలి స్థానానికి దక్షిణాఫ్రికా

గబేహా: స్వదేశంలో శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-0తో గెలుచుకుంది. 348 పరుగుల భారీ ఛేదనలో భాగంగా ఆట చివరిరోజు ఓవర్ నైట్ స్కోరు 205/5తో బ్యాటింగ్‌కు వచ్చిన లంకేయులు.. మరో 33 పరుగులు మాత్రమే జోడించి 238కు ఆలౌట్ అయ్యారు. సఫారీ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (5/76) లంక పని పట్టాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వ (50) కుశాల్ మెండిస్ (46) ఔట్ అవడంతో సఫారీల విజయం ఖాయమైంది. డేన్ పీటర్సన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సౌతాఫ్రికా సారథి టెంబ బవుమాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. ఇక ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో సౌతాఫ్రికా అగ్రస్థానానికి చేరుకుంది. 63.33 శాతంతో దక్షిణాఫ్రికా తొలి స్థానాన్ని దక్కించుకోగా 60.71తో ఆస్ట్రేలియా రెండో స్థానాన నిలిచింది. 57.29 శాతంతో భారత్ మూడో స్థానంలో ఉంది. ఈనెలాఖరున పాకిస్థాన్‌తో సొంతగడ్డపై జరుగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఒక్కటి గెలిచినా సఫారీలు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంటారు. భారత్ విషయానికొస్తే.. ఆసీస్‌తో ఆడబోయే మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తేనే మిగతా సమీకరణాలతో సంబంధం లేకుండా మూడోసారి ఫైనల్‌కు చేరుకునే అవకాశముంటుంది.



## భారత్ జోరు

ఓమన్: మహిళల జూనియర్ ఆసియా కప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తుచిత్తుగా ఓడించిన మన అమ్మాయిలు.. రెండో మ్యాచ్‌లో 5-0తో మలేషియాకు ఓటమి రుచి చూపించారు. పూల్-ఏలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలి అర్ధభాగంలో ఒక్క గోల్ కూడా చేయలేకపోయిన భారత్.. సెకండాఫ్‌లో పుంజుకుంది. స్టార్ స్ట్రైకర్ దీపిక కుమారి హ్యాట్రిక్ గోల్స్ చేయగా కనిక, వైష్ణవి తలా ఓ గోల్ చేశారు.

## శ్రీనిధికి రెండో ఓటమి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్ 2024-25 సీజన్‌లో రెండు విజయాల తర్వాత శ్రీనిధి డెక్కన్‌కు రెండో ఓటమి ఎదురైంది. డెక్కన్ ఎరీనా వేదికగా ఢిల్లీ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి.. 0-1తో పరాభవం పాలైంది. మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున స్టీఫెన్ సమీర్ 71వ నిమిషంలో ఏకైక గోల్ చేశాడు. ఈ టోర్నీలో డిసెంబర్ 13న శ్రీనిధి.. డెంపో ఎఫ్‌సీతో తలపడనుంది.

# పుంజుకున్న లిరెన్

### 12వ రౌండ్‌లో గుకేశ్ ఓటమి • రసవత్తరంగా మారిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోరు

సింగపూర్: ముగింపు దశకు చేరుకున్న కొద్దీ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో పోరు రసవత్తరంగా సాగుతోంది. టోర్నీలో తొలి మ్యాచ్ గెలిచిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్.. 11 రౌండ్ల తర్వాత రెండో విజయాన్ని నమోదుచేశాడు. సోమవారం జరిగిన 12వ రౌండ్‌లో లిరెన్.. గుకేశ్‌పై 39 ఎత్తుల్లో విజయం సాధించాడు. ఈ టోర్నీలో వరుసగా ఏడు గేమ్‌లు డ్రాగా ముగియగా 11వ గేమ్‌లో గుకేశ్ ఎట్టకేలకు గెలిచి ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ సోమవారం లిరెన్ పుంజుకోవడంతో పాయింట్లు సమమయ్యాయి. కాగా 12 రౌండ్లు ముగిసేసరికి ఈ టోర్నీలో ఇరువురూ తలా 6 పాయింట్ల (మొదటగా 7.5 పాయింట్లు సాధించినవారు విజేత)తో సమానంగా ఉన్నారు. మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న మెగా టోర్నీలో గుకేశ్, లిరెన్ తలా ఓ మ్యాచ్ నెగ్గినా లేక రెండు గేమ్‌లు డ్రా అయినా విజేతను నిర్ణయించేందుకు టై బ్రేకర్ అవసరం అయ్యే అవకాశముంది. అలా కాకుండా ఇరువురిలో ఒక్కరు వరుసగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుంటే వారే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ కిరీటాన్ని దక్కించుకుంటారు. మంగళవారం సెలవు దినం కాగా బుధ, గురువారాలలో మిగిలిన రెండు రౌండ్స్ జరుగనున్న ఈ టోర్నీలో ఇకనుంచి హోరాహోరి పోరు జరగడం ఖాయం.



## సిరాజ్‌కు జరిమానా



దుబాయ్: ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గాను టీమ్ ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ జరిమానా ఎదుర్కొన్నాడు. అడిలైడ్ టెస్టులో భాగంగా ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసిన తర్వాత ఆ ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఐసీసీ.. సిరాజ్ మ్యాచ్ ఫీజులో 20 శాతం కోతతో పాటు డీమెరిట్ పాయింట్ విధించింది. హెడ్‌కు జరిమానా లేకపోయినా డీమెరిట్ పాయింట్ ఇచ్చింది.

## పారా ఏషియన్ త్రో బాల్ పోటీల్లో భారత్‌కు స్వర్ణం

### జట్టు విజయంలో రాష్ట్ర విద్యార్థి చింటూరెడ్డి కీలకపాత్ర



మన్సూరాబాద్, డిసెంబర్ 9: కంబోడియాలో ఈనెల 4 నుంచి 7 వరకు జరిగిన పారా ఏషియన్ చాంపియన్‌షిప్ త్రో బాల్ పోటీల్లో భారత్‌కు స్వర్ణ పతకం లభించింది. భారత్ జట్టులో మన్సూరాబాద్, శైలజాపురి కాలనీలోని దివ్యాంగుల హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న గోనె చింటూరెడ్డి సభ్యుడిగా ఉన్నాడు. భారత్ స్వర్ణం గెలవడంలో అతడు కీలకభూమిక పోషించాడు. గత పదేండ్లుగా దివ్యాంగుల హాస్టల్లో ఉంటూ చదువుకుంటూ ఆటల్లో తనకున్న మక్కువతో ఎన్నో అడ్డంకులను అధిగమించి దేశానికి ప్రాతినిథ్యం వహించే స్థాయికి ఎదిగిన చింటూరెడ్డి.. టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్టు విద్యార్థులు తెలిపారు. చింటూరెడ్డి వంటి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించలేకపోయిందని, అయినా నిరాశ చెందకుండా అతడు తన సొంతడబ్బుతో కంబోడియా వెళ్లాడని చెప్పారు. పారా ఏషియన్ సెక్రటరీ వివేషన్ చేతులమీదుగా చింటూరెడ్డి ప్రశంసాపత్రాన్ని, మెడల్‌ను అందుకున్నారు.



## షమీ ఆల్‌రౌండ్ షో

బెంగళూరు: ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న మహ్మద్ షమీ..సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో నిలకడగా రాణిస్తున్నాడు. బెంగళూరు వేదికగా చండీగఢ్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ 1లో షమీ బంతితో పాటు బ్యాట్‌తోనూ రాణించి బెంగాల్‌ను క్వార్టర్స్ చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్‌లో 17 బంతుల్లోనే 3 బౌండరీలు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసిన షమీ.. 4 ఓవర్లు వేసి ఒక వికెట్ కూడా పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో బెంగాల్ 159/9 పరుగులు చేయగా చండీగఢ్.. 156 పరుగులకే పరిమితమైంది.

## తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి

పూణె: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) తెలుగు టైటాన్స్‌కు మరో ఓటమి ఎదురైంది. సోమవారం పూణెలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్.. 25-46తో హర్యానా స్టీలర్స్ చేతిలో పరాభవం పాలైంది. హర్యానా తరఫున శివమ్ పటారె (12), వినయ్ (7) మెరిశారు. టైటాన్స్ నుంచి ఆశిష్ (13) పోరాడినా ఫలితం లేకుండా పోయింది. తాజా విజయంతో పాయింట్ల పట్టికలో హర్యానా అగ్రస్థానంలో కొనసాగుతుండగా తెలుగు టైటాన్స్ ఆరో స్థానంలో ఉంది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.